పోస్టల్ బ్యాలెట్స్ చాలా కీలకం

చిన్న పొరపాటు కూడా జరగకూడదు

శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర. విజయనగరం : ప్రస్తుత పరిస్థితుల్లో పోస్టల్ బ్యాలెట్లు ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పోస్టల్ బ్యాలెట్ల తయారీ, జారీ, స్వీకరణలో ఎక్కడా చిన్న పొరపాటు కూడా రాకూడదని స్పష్టం చేశారు. అన్ని దశల్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. ఎన్నికల శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా, పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించిన అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీలుగా ఎంపికైన డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణ చక్రవర్తి, జిల్లా బిసి సంక్షేమాధికారి కె.సందీప్ కుమార్ శిక్షణ ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాల తయారీ, ఓటింగ్, కౌంటింగ్, ఫెసిలిటేషన్ సెంటర్ సిబ్బంది నియామకం, ఇంటివద్దే ఓటింగ్ తదితర అంశాల గురించి వీరు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, గత ఎన్నికలతో పోలిస్తే, ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లు, ఓటింగ్, కౌంటింగ్ విధానాల్లో పలు మార్పులు వచ్చాయని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల్లో ఇవన్నీ స్పష్టంగా ఉన్నాయని, వీటిని పూర్తిగా అర్ధం చేసుకోవాలని సూచించారు. గతంలో సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధుల్లో ఉన్న వారికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్లు జారీ చేసేవారని చెప్పారు. ప్రస్తుతం వీరితోపాటు ఆబ్సెంట్ ఓటర్ల విధానం కూడా కొత్తగా వచ్చిందని తెలిపారు. దీనిలో భాగంగా వయసు 80 సంవత్సరాలు దాటినవారు, 40 శాతం పైబడి వికలాంగత్వం ఉన్న విభిన్న ప్రతిభావంతులు, కోవిడ్ వ్యాధిగ్రస్తులు, అత్యవసర సర్వీసుల్లో ఉన్నవారు కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకొనే అవకాశం కల్పించారని తెలిపారు. వీరు పోస్టల్ బ్యాలెట్ కోసం ముందుగా దరఖాస్తు చేసుకుంటే, నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం వాటిని జారీ చేయాల్సి ఉంటుందన్నారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, కోవిడ్ వ్యాధిగ్రస్తులు తాము ఇంటివద్దనుంచే ఓటు వేస్తామని కోరితే, ఆ మేరకు ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతీ బ్యాలెట్ పత్రం పైనా ఆఖర్లో నోటా తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. అంధుల కోసం బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పత్రాన్ని కూడా పోలింగ్ స్టేషన్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సిబ్బందికి వివిధ అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని మాస్టర్ ట్రైనీలను కలెక్టర్ ఆదేశించారు. ఈ శిక్షణలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఓ ఎస్‌డి అనిత, మెప్మా పిడి సుధాకరరావు, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ ప్రభాకర్, మాస్టర్ ట్రైనీలు, వివిధ నియోజకవర్గాల నుంచి డిప్యుటీ తాశిల్దార్లు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం/పార్వతీపురం టౌన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరగాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాల యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, తహశీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమనిబంధనలు, మార్గ దర్శకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎక్కడా ఎటువంటి నిబంధనల ఉల్లంఘన జరగరాదన్నారు. నిబంధనల ఉల్లంఘిస్తే కఠినచర్యలుంటాయని హెచ్చరించారు. తహశీల్దార్లు తమ లాగిన్ ఐడి, పాస్‌వర్డ్, డిజిటల్ కీలను భద్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాలు, 154 సెక్టార్ లు ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రతి మండలంలో 8 నుండి 12 సెక్టార్ లు ఉన్నాయని ఆయన తెలిపారు. 8 వందల పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పెట్టుటకు చర్యలు తీసుకుంతున్నామని చెప్పారు. సెక్టార్ అధికారులతో నిరంతరం సమావేశాలు నిర్వహించాలని, ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సంబంధిత అంశాలు ముందస్తుగానే పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పరిశీలించి, కొరత ఉంటే వెంటనే పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. పోలింగ్ రోజున ఆన్‌లైన్‌లోనే ఓటింగ్ వివరాలు నమోదు చేయాలని, నిర్దేశిత సమయంలో విధిగా జరగాలని ఆయన ఆదేశిం చారు. ఇవిఎంల వినియోగంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని ఆయన అన్నారు. నియోజకవర్గం వారీగా స్ట్రాంగ్ రూమ్ లను తనిఖీ చేయాలని, అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లు చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఓటరు నమోదు, తొలగింపుకు కొత్తగా దరఖాస్తులు వస్తాయని వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. జేసి నుండి వచ్చిన ఆదేశాల మేరకు మాత్రమే పట్టాలు, పాస్ పుస్తకాలు, వన్‌బి వంటి అంశాలు జారీ చేయా లని ఆయన స్పష్టం చేశారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారులు రక్త హీనత కార్యాచరణ బృందాల పనితీరు పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్, ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, పార్వతీపురం రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి వెంకట రమణ మున్సిపల్ కమిషనర్ పిసింహాచలం తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టిడిపిలో చేరిన 100 కుటుంబాలు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో మంగళవారం వైకాపా పార్టీ నుండి 3వ డివిజన్ కు చెందిన పక్కి సంతోష్, పాటోజు మోహన్, మానాపురం శేఖర్ తదితరులు మత్స్యకార సంఘం తరఫున 1, 4 డివిజనులకు చెందిన అమర రామకృష్ణ, సురపతి దుర్గారావు, బొందు ఎల్లాజీ తదితరులు అందరూ సుమారు 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని నియోజకవర్గ ఇంచార్జ్ పూసపాటి అదితి గజపతి రాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పూసపాటి అదితి గజపతి రాజు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి పంపించే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అన్ని రంగాలను ఇబ్బందులకు గురిచేసి, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఈ సైకోపాలన పోయి సైకిల్ పాలన కోసం ప్రజలందరూ ఎదురు చూస్తున్నారన్నారు. అందులోభాగంగా వీరంతా పార్టీలో చేరడం జరిగిందన్నారు. నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చేయుటకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కర్రోతు నరసింగరావు ,కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు,కనకాల మురళీమోహన్,కంది మురళి నాయుడు, నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తమ్మిరాజు పేటలో రెండో విడత ఆరోగ్య సురక్ష ప్రారంభం

విశాలాంధ్ర-మెంటాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరంగా మారిందని మండల ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని తమ్మిరాజు పేట గ్రామంలో రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి రామనాద్ సమక్షంలో ఎంపీపీ చేతుల మీదుగా ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలలో పేద ప్రజలు వారికి సంభవించిన రోగాలు నయం చేసుకోవడంలో లేదా ఎక్కడికి వెళ్లాలో తెలియక డబ్బులు లేని పరిస్థితిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతో మేలు చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మి రాజుపేట పంచాయతీ చెందిన మధుర గ్రామమైన పనుకోవనివలస చుట్టుపక్కల ఉన్న గ్రామ ప్రజలందరూ వచ్చి ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ల వద్ద వాటి సమస్యలు తెలియజేసి తగిన మందులు తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుమారుగా.406 మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారని మాజీ వైస్ సర్పంచ్ చొక్కాకు సన్యాసి నాయుడు తెలియజేశారు. కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ నాయకులు చొక్కాకు సన్యాసి నాయుడు, ఎంపీడీవో సిహెచ్ లక్ష్మీబాయ్, ఇ.ఓ. పి ఆర్ డి విమల కుమారి సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ పట్నాయక్ డాక్టర్లు కల్పన, డాక్టర్ గౌతమ్ కుమార్, డాక్టర్ భరద్వాజ్, సి హెచ్ ఓ యస్. సత్యనారాయణ హెచ్.వి జ్యోతి, ఏఎన్ఎం పార్వతి, హాస్పటల్ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ పోలీస్ స్టేషన్ ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ



విశాలాంధ్ర-గంట్యాడ : జిల్లా ఎస్పీ ఎం దీపికపాటిల్ గంట్యాడ పోలీస్‌స్టేషన్ ను మంగళవారము ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను సిడి ఫైల్స్ ను తనిఖీ చేశారు రాబోయే ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలను పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని సమస్యలు సృష్టించే వ్యక్తులను గ్రామాలలో గుర్తించి బైండోవర్ కేసులు బుక్ చేయాలని తాసిల్దార్ కార్యాలయంలో మంచి ప్రవర్తన కోసం బాండులను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు గ్రామాలలో మీటిం%యి%గులు నిర్వహించి అసాంఘిక కార్యకలాపాల సమాచారం తక్షణమే పోలీసులకు అందేలా నిఘా ఏర్పాటు చేయాలన్నారు విజయనగరం రూరల్ సిఐఎం శ్రీనివాసరావు గంట్యాడ ఎస్సై సురేందర్ నాయుడు ఆకస్మిక తనిఖీ సమయంలో హాజరుగా ఉండి ఎన్నికల నిర్వహణకు తాము చేపట్టిన చర్యలను జిల్లా ఎస్పీకి వివరించారు.

పాయకరావుపేట సంకల్ప సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-జామి: ఈనెల 10న మధ్యాహ్నం పాయకరావుపేటలో జరిగే దళితవాడ పంచాయితీసాధన మహాసంకల్పసభను విజయవంతం చేయాలని అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు పిలుపునిచ్చారు. ఎయిమ్ వ్యవస్థాపకులు పివి. సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఈమహాసభకు భారీ ఎత్తున హాజరుకావాలన్నారు. దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు ఐక్యంగా కృషి చేద్దామన్నారు.

పట్టణ పారిశుధ్య మెరుగుకు సహకరించండి

మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణ ప్రజలు పారిశుద్ధ్యం మెరుగుకు మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య వాహనాలకు అందించాలని విచ్చలవిడిగా చెత్తను మున్సిపల్ రోడ్డులో కాలువల వేయరాదనిమున్సిపల్ కమిషనర్ ఎల్ రామలక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణం రాణి మల్లమ్మ దేవి పార్కు వద్ద ఇటీవల ఏర్పాటుచేసిన బస్టాప్ పరిసర ప్రాంతంలో ఎటువంటి దుర్గంధమైన వాతావరణం లేకుండా చేపల దుకాణాలను వేరే స్థలానికి మార్చే విధంగా చర్యలు చేపట్టాలని అక్కడే ఉన్న మున్సిపల్ డస్ట్ బిన్ నుండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని పర్యావరణ ఇంజనీర్ సోమేశ్వరరావు ను మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలని కల్లుగీత కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-గజపతినగరం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కళ్ళు గీత కార్మికులు మంగళవారం గజపతినగరం తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు గౌతు లచ్చన్న కళ్ళు గీత వృత్తిదారుల సంఘం గౌరవ అధ్యక్షులు పురం అప్పారావు ఆధ్వర్యంలో ధర్నా జరిపారు ప్రధానమైన ఐదు సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని గజపతినగరం తహసిల్దార్ రమేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో సింహాచలం, కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.

ఆన్ లైన్‌లో పోస్టుల నియామక మెరిట్ జాబితాలు

విశాలాంధ్ర-విజయనగరం : ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరంలో బయో మెడికల్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ఓటి టెక్నీషియన్ పోస్టుల మెరిట్ జాబితాలు ఆన్ లైన్‌లో పొందుపరచడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మలీల తెలిపారు. http://vizianagaram.ap.gov.in, http://vizianagaram.nic.in వెబ్‌సైట్‌లలో ఈ పరీక్షల ఫలితాలు తెలుసు కోవచ్చున్నారు. ఏపి వైద్యవిధాన పరిషత్ నుంచి ఆప్షన్ ద్వారా వచ్చిన ఫ్లంబర్‌లను వైద్య విద్యాశాఖ డైరెక్టరేట్ లోకి తీసుకున్న కారణంగా యీ పోస్టుల నియామకం కోసం వేసిన నోటిఫికేషన్ రద్దు అయినట్లు తెలిపారు. దీనిపై సవరణ నోటిఫికేషన్ జారీచేయడం జరిగిందన్నారు.

పనిచేసే చోట లైంగిక వేధింపులు జరగకుండా చూడాలి

మున్సిపల్ కమిషనర్ మల్లయ్య నాయుడు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పనిచేసే చోట లైంగిక వేధింపులు జరగకుండా చూసుకోవాలి మున్సిపల్ కమిషనర్ మల్లయ్య నాయుడు . మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విజయనగరం అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ప్రసన్న ఆధ్వర్యంలో అర్బన్ మరియు రూరల్ ఏరియాలో ఉన్న మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లయ్య నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ హోమ్ లో, పరిశ్రమలు, సహకార సంస్థలు క్రీడా సంస్థలు సేవా సంస్థలు విద్యాసంస్థలలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఫిర్యాదుల అంతర సమాఖ్య కార్యాలయ స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. సిడిపిఓ ప్రసన్న మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు చట్టం 2013 ఉద్దేశించి ఈ చట్టాన్ని న్యాయబద్ధంగా నిర్వహించగలగేలా ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. అందుకు మహిళా పోలీసులు సమర్ధవంతంగా పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్ తిరుమల రావు, వన్ స్టాప్ సెంటర్ నుంచి రమాదేవి, వెంకటలక్ష్మి, మరియు ఐసిడిఎస్ సూపర్వైజర్లు తదితరులు హాజరయ్యారు.

చెరువు గట్లపై గ్రామాభివృద్ధికి కూరగాయ పంటలు, ఉచితంగా పంపిణీ

విశాలాంధ్ర-తెర్లాం: మండలం లో గోపాలవలస సర్పంచ్, వైస్ సర్పంచ్, వార్డు మెంబర్లు కలసి గ్రామంలో 60 ఇళ్లకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ మేరకు జగన్నాధవలస గోండాల వెంకట్రావు మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ, గవర్నమెంట్ చెరువు గట్లపై గ్రామ అభివృద్ధికి కూరగాయలు పండించి ప్రజలకు పంటను ఉచితం గా పంపిణి చేయడం జరుగుతుందని వెంకట్రావు తెలిపారు.

రైతు సంఘం గౌరవాధ్యక్షులు రెడ్డి అప్పలనాయుడు మృతి

విశాలాంధ్ర-రాజాం : రైతు సంఘం గౌరవ అధ్యక్షులు రెడ్డి అప్పలనాయుడు మృతిచెందారు. మంగళవారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యం తో బాధపడుతున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు కుమార్తె కలరు. ఆయన వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయ కాలంలో ఉపాధ్యాయ సంఘానికి యెనలేని సేవ చేశారు. అదే సమయంలో ఏపీటీఎఫ్ సంఘానికి జిల్లా అధ్యక్షునిగా సేవలు అందించారు. అదే విధంగా మడ్డువలస ప్రాజెక్ట్ నిర్మాణానికి,మరియు నిర్వాసితులు సమస్యలు పరిష్కారానికి కూడా యేన లేని సేవ చేశారు. రైతు సంఘం గౌరవ అధ్యక్షులుగా పనిచేసే అనేక ఉద్యమంలో పాల్గొన్నారు. రాజాం పట్టణంలో కళా రంగానకు విశిష్టమైన సేవలు అందించి ఎంతో మంది కళాకారులను ప్రోత్సహించారు ఆయన ఎంతో మంది విద్యార్ధులకు విద్యను అందించే విషయములో ఆర్థికంగా సహాయాన్ని అందించారు. ఆయన మృతి పట్ల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షులు నారు జనార్దన్ రావు, నియోజవర్గ అధ్యక్షులు పాలవలస రామినాయుడు, రైతు సంఘం నాయకులు రౌతు గణపతి రావు, మీసాల అప్పలనాయుడు, సిపిఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్, రుంకు శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు

విజ్ఞానపు గని విశాలాంధ్ర బుక్‌హౌస్ ను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ రావు

విశాలాంధ్ర-బొబ్బిలి : పుస్తకాలు చదవడంతోనే మానవులు విజ్ఞానాన్ని అపారంగా సంపాదించవచ్చని. విజ్ఞానాన్ని అందించడంలో విశాలాంధ్ర బుక్స్ హౌస్ విజ్ఞానపు గని అని పాఠకలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ రావు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విశాలాంధ్ర బుక్ హౌస్ సంచార వాహనాన్ని మున్సిపల్ చైర్మన్ సావు ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్‌చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సావు మాట్లాడుతూ విశాలాంధ్ర సంచార బస్సు వాహనంలో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపయోగపడే అనేక పుస్తకాలు, మానవ మేధస్సుకు ఉపయోగపడే ప్రతి పుస్తకము. మరియు. చిన్నపిల్లలకు సంబంధించిన పుస్తకాలు, రామాయణం ,మహాభారతం. స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలు ప్రచురిస్తున్నారని. తెలుగు రాష్ట్రాల్లో విశాలాంధ్రకు సుదీర్ఘమైన చరిత్ర ఉందని అన్నారు. ఈ అవకాశాన్ని పట్టణంలో ఉన్నటువంటి విద్యార్థులు యువకులు. మేధావులు పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. సిపిఐ బొబ్బిలి పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్. సిపిఐ బొబ్బిలి మండల కార్యదర్శి తాడంగి ఎండుదొర. విశాలాంధ్ర పత్రిక రిపోర్టర్ రేఖా తవుడు, సిపిఐ పట్టణ నాయకులు కళ్యాణ గణేష్. విశాలాంధ్ర బుక్‌హౌస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఓపిఎస్ ను జయప్రదంచేయండి

విశాలాంధ్ర-సీతానగరం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ సాధనకు యుటిఎఫ్ రాష్ట్రశాఖ తలపెట్టిన ప్రత్యేక కార్యాచరణను జయప్రదం చేయాలని యుటిఎఫ్ నేతలు కోరారు.మంగళవారం సీతానగరం ఎమ్మార్సీ ఆవరణలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఓట్‌ఫర్ ఓపిఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల శాఖ అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావులు మాట్లాడుతూ పాత పెన్షన్ పథకం సాధనకు యుటిఎఫ్ చేపట్టిన ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఈనెల 6నుండి 12వరకు పోస్టుకార్డుఉద్యమం అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు లేఖలు రాస్తామన్నారు. ఈనెల 13 నుంచి 29వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరనున్నట్టు తెలిపారు. ఈ కార్యచరణలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం గోవింద రావు, మండల కౌన్సిల్ సభ్యులు ఆదినారాయణ, బి.రమేష్, ఉపాధ్యాయులు కృష్ణ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ఆరాధ్యదేవత

శ్రీ శంబర పోలమాంబ జాతర సంబరాలు

విశాలాంధ్ర-మక్కువ: మండలంలోని శంబర గ్రామంలో ఉత్తరాంధ్ర ఆరాధ్యదేవత శంబర పోలమాంబ అమ్మవారి మారు జాతర సంబరాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా భక్తులు సంఖ్య పెరిగింది. జాతర కు దేవాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి వివిఎస్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. వనం గుడి వద్ద అమ్మవారిని భక్తులు దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా క్యూలైన్లను పటిష్టంగా ఏర్పాటు చేసి అమ్మవారి వేపచెట్టు దగ్గర మొక్కులు తీర్చుకునే భక్తుల కోసం పసుపు కుంకుమ దీపాలు సంబంధించిన పూజా సామగ్రిని అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఎండలు ఎక్కువ కావడం వల్ల వృద్ధులకు, చిన్నపిల్లలకు తాగునీటి సదుపాయం, ఇతర సదుపాయలు ఏర్పాట్లు చేశారు గతవారం కంటే భక్తులు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. దీంతో సీఐ ధనుంజయ్ రావు ఆధ్వర్యంలో మక్కువ సబ్ ఇన్స్పెక్టర్ నరసింహామూర్తి పర్యవేక్షణలో 100 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే సాలూరు, పార్వతీపురం విజయ నగరం డిపోల నుండి బస్సులను భక్తుల సౌకర్యార్ధం తిప్పనున్నారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్యదేవత సౌకర్యాలు భక్తులకు వాటర్ ప్యాకెట్లు ఉచిత ప్రసాదాలు పులిహోర లడ్డూలు అమ్మవారికి అధికసంఖ్యలో భక్తులు జనా వాహి పెరుగుతుండడం విశేషం రెండో వారం మంగళవారం భక్తుల రద్దీ పెరిగింది ఎక్కడికక్కడ మెడికల్ క్యాంపులు తలనీలాలు ఉచిత ప్రసాదాలు, బందోబస్తు క్యూలైన్ ఏర్పాట్లు ఎక్కడా ఎటువంటి అవాంతరాలు జరగకుండా కార్యనిర్వహణాధికారి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పార్వతీపురం రైల్వే రిజర్వేషన్ సమయాల్లో మార్పు

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం (బెలగాం) రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ సమయం మార్పు చేసినట్లు స్టేషన్ సూపరెంటెండెంట్ పి. శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఉదయం 9:30 నుండి 10:30 వరకు, మధ్యాహ్నం 1.గంట నుండి 3 గంటల వరకు మరలా సాయంత్రం 6. గంటల నుండి 7. గంటల వరకు ఉండేదని, జిల్లా కేంద్రం కావడం, ప్రయాణీకుల రద్దీ పెరగడం దృష్ట్యా రిజర్వేషన్ సమయంలో మార్పులు చేసినట్లు తెలిపారు. మంగళవారం (నేటి నుండి) నుండి ఉదయం 8. గంటల నుండి సాయంత్రం 4. గంటల వరకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం జరిగిందని, మధ్యాహ్నం 1.గంట నుండి 1.30 వరకు భోజన విరామం ఉంటుందని తెలిపారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించి అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా కోరారు.

వంతెన పై అదుపు తప్పిన వ్యాన్

విశాలాంధ్ర -గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కురుపాం నుండి గుమ్మ లక్ష్మీపురం వెళుతున్న మినీ వ్యాన్ కురుపాం మండలం లోని గుమ్మ గదభవలస దగ్గరలో ఉన్న బ్రిడ్జ్ వద్ద తృటిలో ప్రమాదం తప్పింది. పార్వతీపురం నుండి గుమ్మ లక్ష్మీపురం డిగ్రీ కళాశాలకు పరీక్ష పేపర్లు తీసుకు వెళుతున్న వ్యాన్ మంగళవారం అదుపుతప్పి వంతెనను ఢీ కొట్టి వంతెన మీదగా దూసుకు వెళ్ళింది. మినీ వన్ రెండు చక్రాలు గాలిలో రెండు చక్రాలు బ్రిడ్జి పైన ఉండి తృటిలో ప్రమాదం తప్పింది. కొంచెం ముందుకు వెళ్తే వ్యాను వంతెన నుండి బోల్తా పడేది. ఇంతటి ప్రమాదం జరిగినప్పటికీ వాహనంలో ఉన్న ప్రయాణకులకి ఏమీ జరగలేదు. స్థానికుల సహాయంతో వాహనమును బయటకు తీయడం జరిగింది.ఆ కొద్దిసేపు ట్రాఫిక్ కి అంతరాయం జరిగింది.

గిరిజనుల అభ్యున్నతికి జిసిసి ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర-కొమరాడ: గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులలో జీవన నైపుణ్యాలు పెంచడానికి, స్వయం సహాయక సంఘాల అభ్యున్నతికి గిరిజన సహకార సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి. సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని దేవుకోన గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్ దన్ కేంద్రాలను సందర్శనచేశారు. ఆయన మాట్లాడుతూ ఇందిరాక్రాంతి పథకంతో కలిసి జిసిసి సమన్వయం చేసుకొని రాష్ట్ర వ్యాప్తంగా 415కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లోని గిరిజన సహకార సంస్థ పలు కార్యక్రమాల్లో గిరిజనులకు జీవనాధారంలో చేయూతనిస్తున్న సంగతి తెలిసిందేనన్నారు. వన్ దన్ కేంద్రాలలో కూడా జిసిసి ఇందిరా క్రాంతి పథకంతో పనిచేస్తూ వారి అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నట్లు తెలిపారు. గిరిజనుల జీవన నైపుణ్యాలు పెంచడానికి జిసిసి ఇతోధికంగా తోడ్పడుతుందని ముఖ్యముగా వాళ్ళు పండించే అటవీ వ్యవసాయ ఉత్పత్తులు వేల్యూ యాడెడ్ చేసి వారికీ కావలిసిన వసతులు కల్పించుటకు ప్రాజెక్ట్ ఆఫీసర్స్ ద్వారా ప్రభుత్వము నివేదికలు పంపుతామని తెలిపారు.ఈకార్యక్రమంలో జిసిసి డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్, వెలుగు ఏపిడి సత్యంనాయుడు, మార్కెటింగ్ మేనేజరు శేఖర్, రమనమూర్తి,ప్రవీణ్, ఇందిరా క్రాంతి పథకం జిల్లా,డివిజన్, దేవి కోన సర్పంచ్ దొర వెలుగు ఇన్చార్జి ఏపిఎం వెంకటరమణ, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాకార్యకర్తల సమస్యలకు పరిష్కారం చేయాలి

విశాలాంధ్ర-సీతానగరం: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ వైద్యాధికారిని పావనికు ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని ఆశాలు అందరూ జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు గవర వెంకటరమణ కోరారు. ఈకార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మె జీవోలు విడుదల చేయాలి

మునిసిపల్ వర్కర్స్ &ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని గత పధహారు రోజులుగా సమ్మె చేపట్టిన మునిసిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చల ద్వారా జీవోలను విడుదల చేసి హామీలను అమలు చేస్తానని ప్రభుత్వ అధికారులు బహిరంగంగా ప్రకటించారని, నేడు సమ్మె విరమించి నెలరోజులు గడుస్తున్న ప్రభుత్వం పూర్తిగా విస్మరిచిపోయిందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్. శంకర్రావు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి. వెంకటరమణ ప్రభుత్వాన్ని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక పార్వతీపురం డిఆర్ఓ ఇన్చార్జ్ కేశవ నాయుడుకు యూనియన్ నాయకులు, కార్యకర్తలు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్రావు, జి. వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వాపోయారు. సమ్మె ముగింపు రోజు జరిగిన ఒప్పందాల మేరకు జీవోలను రెండూ లేదా మూడు రోజుల్లోనే జారీ చేస్తామని నాడు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, అధికారులు హామీ ఇచ్చారని, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాల చెల్లింపు విషయమై ఏర్పాటు చేసిన తొమ్మిది మంది అధికారుల కమిటీ నివేదికను జనవరి నెలాఖరులోపు నివేదిస్తామన్నారని అలాగే క్లాప్ డ్రైవర్లకు చట్ట బద్ధమైన జీత భత్యాలు చెల్లింపు విషయ మై జనవరి నెలాఖరులోపు జాయింట్ మీటింగ్ ఏర్పాటుచేస్తామని అంగీకరిం చారని వాటిని పూర్తిగా మరిచారని తెలిపారు. క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్స్ కు సంబంధించి రూ. 21 వేలు, శానిటేషన్ డ్రైవర్లు, విలీన గ్రామపంచాయతీ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించి రూ.21వేలు జీతం, పిఎఫ్, ఇఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్ 75000, దహన సంస్కారాలకు 20000, ఎక్స్‌గ్రేషియో సాధారణ మృతికి రెండు లక్షలు, ప్రమాదమృతులకు ఐదు నుండి ఏడు లక్షలకు పెంపు, పర్మినెంట్ సిబ్బందికి సంబంధించి 20 కోట్ల రూపాయలకు పైగా బకాయి ఉన్న సరెండర్ లీవులు చెల్లింపులు, జిపిఎఫ్ అకౌంట్లు ప్రారంభం, క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్ను సంబంధించి సంక్షేమ పథకాలు అమలు తదితర జీఓలను నేటికీ జారీ చేయక పోవడం శోచనీయమని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కాలయాపన విడనాడి తక్షణమే జీవోలు జారీ చేయాలని అంగీకార ఒప్పందాల మేరకు తక్షణమే ఇంజనీరింగ్ కార్మికులు మరియు క్లాప్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి జాయింట్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ ఫెడరేషన్, సీఐటీయూ డిమాండ్ చేస్తుందని లేకుంటే మరో పోరాటానికి సన్నద్ధం కానున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సింహాచలం, ఎం. శివ, ఎన్. మలేష్, నిర్మల, బి. శ్రీకాంత్, టి. జాన్, పి. రాజశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో యునివర్సిటీ ఏర్పాటు చేయాలి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



విశాలాంధ్ర-బెలగాం: ఎఐఎస్ఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా సమావేశం అర్.కె జూనియర్ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ నాయకులు పి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. నాగభూషణం మాట్లాడుతూ మన్యం జిల్లా ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తున్నా విద్యాభివృద్ధికి తోడ్పడే విద్యాసంస్థలు జిల్లాలో లేకపోవడం చాలా అన్యాయమని రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, పార్వతీపురం మన్యం జిల్లాలు బాగా వెనుకబడిన ప్రాంతాలని, ఇటువంటి ప్రాంతాలను విద్యాభివృద్ధితోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారం చేయాలని అన్నారు కావున వెంటనే విద్యారంగ సమస్యలు పరిష్కరించి, విద్యాభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పార్వతీపురంలో మెడికల్, ఐటిఐ, పిజి, సాలూరులో బిఈడి, పాలకొండలో పిజి, గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాలలు నిర్మించాలని, కురుపాం ఇంజనీరింగ్ కళాశాల భవనం త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, గరుగుబిల్లి, సీతంపేట మండలాల్లో జూనియర్ కళాశాలలు నిర్మించాలని, బలిజిపేట, కురుపాం, బామిని, పాచిపెంట మండల కేంద్రాలలో డిగ్రీ కళాశాలలు నిర్మించాలని, వీరఘట్టంలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని, పాలకొండ డివిజన్ కేంద్రంలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని, గిరిజన పోస్ట్ మెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టలుకు సొంత భవనం నిర్మించాలని, డిగ్రీ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని, సాలూరు పోస్టుమెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టల్ కి రోడ్డు సౌకర్యం కల్పించాలని, సీతంపేట పాలిటెక్నికల్ విద్యార్థులకు సొంత హాస్టల్ ఏర్పాటు చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు బకాయిలుగా నిలిచిన మెస్ బిల్లులు విడుదల చేయాలని, ఉపాధ్యాయులపై యాప్ ల విధాన నిబంధనలను రద్దు చేయాలని, 117 జీఓను రద్దు చేసి, పాఠశాలల విలీనం ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ బి. రవికుమార్ మాట్లాడుతూ రేపటి భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, విద్య కాషాయకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు మరింత ఉధృతంగా చేపట్టాలన్నారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ జిల్లా నూతన కమిటీని 12 మందితో ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులుగా పి.రమణ, ప్రధాన కార్యదర్శిగా బి. రవి కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా సమితి సభ్యులకు అభినందనలు తెలిపారు.

స్వచ్‌భారత్ కార్యక్రమం నిర్వహించిన అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట, కామాక్షినగర్ వద్దనున్న నడక మైదానంలో మంగళవారం ఉదయం స్వచ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, డిస్ట్రిక్ట్ -102 డిప్యూటీ గవర్నర్ త్యాడ రామకృష్ణారావు(బాలు) మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించామని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యం బాగుంటుందనే ఉద్దేశ్యంతో స్వచ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించామని, ఈసందర్భంగా నడక మైదానంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని సభ్యులంతా ఏరివేసి, పిచ్చి మొక్కలను తీసివేసి శుభ్రపరిచారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, నలమహరాజు,శ్రీరామ్,పి.శ్రీను,రమేష్,అప్పారావు మాస్టారు,సాంబ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బగ్గందొరవలసలో కాలువలలో పూడికతీత

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని బగ్గందొరవలస గ్రామ పంచాయితీలో కాలువలో పేరుకుపోయిన పూడికలు, చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.సర్పంచ్ నారాయణరావు, సెక్రటరీ శ్రీనివాసరావు తదితరులు దగ్గరుండి పర్యవేక్షణ చేశారు. ఈఓపిఆర్డీ కుమార్ వర్మ కూడా పర్యవేక్షణ చేసినట్లు తెలిపారు. ఇదిలాఉండగా తామరఖండిలో కూడా కాలువలో పేరుకుపోయిన పూడిక తీతను తీసినట్లు సర్పంచ్ మూడడ్ల లలితవెంకటనాయుడు, సెక్రటరి పద్మావతిలు తెలిపారు.

వేటూరి ప్రభాకర శాస్త్రి జీవితం'పై అతిథి ఉపన్యాసం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. మాడుగుల కళాశాలలో తెలుగు అధ్యాపకులైన డాక్టర్ పులవర్తి పైడిరాజు డిగ్రీ కళాశాలకు విచ్చేసి "వేటూరి ప్రభాకర శాస్త్రి జీవితం" అను అంశంపై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. తెలుగు సంస్కృత భాషా పండితులైన వేటూరి ప్రభాకర శాస్త్రి రచయితగా, చరిత్ర కారునిగా, భాషా పరిశోధకునిగా ప్రసిద్ధి చెందారని, చాటుపద్యమణిమంజరి, శృంగార శ్రీనాథం, క్రీడాభిరామం, ప్రాచీనాంధ్ర శాసనాలు వంటి పలురచనలతో పాటు అన్నమయ్య కీర్తనలను లోకానికి అందించడంలో వీరు విశేష కృషి చేశారని,"నాగబు" తొలి తెలుగు పదంగా ప్రతిపాదించారని, నాగానందం వంటి అనువాద నాటకాలు రచించారని పైడిరాజు విద్యార్థులను ఉద్దేశించి ఉపన్యసించారు. తెలుగు విభాగాధిపతి రేచర్ల లక్ష్మి పైడిరాజుని సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, కళాశాల అధ్యాపకులు సుధీర్, వీరన్న, వలీఖాన్, భాస్కర్, హైమవతి, లక్ష్మణ్, అప్పలరాజు, సురేష్, ప్రసాదరావు, జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఆర్టీసీ డ్రైవర్లు రహదారి భద్రతపై అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని, మద్యపానం, ధూమపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డిపో మేనేజర్ కె.రమేష్ పిలుపునిచ్చారు. ఆర్టీసీలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక రవితేజ స్కూల్ విద్యార్థులతో ఆర్టీసీ సిబ్బంది కలిసి రహదారి భద్రతకు తీసుకోవలసిన జాగ్రత్త నినాదాలు పలుకుతూ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రతకు డ్రైవర్స్ పాటించవలసిన నియమాలు పొందు పరిచిన ఫ్లకార్డులను పట్టుకొని విద్యార్థులు శృంగవరపుకోట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డిపో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో విజయ నగరం ఆర్టీసీ రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్ సి. హెచ్.వేణు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు, సెక్యూరిటీ హెడ్ గార్డ్, రవితేజ స్కూల్ ఉపాధ్యాయులు, ట్రాఫిక్ గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ప్రతి రోజు డిపో సిబ్బందికి రహదారి భద్రత గురించి అవగాహన కల్పిస్తున్నట్లు మేనేజర్ రమేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమం డిపో మేనేజర్ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.

పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించండి

మున్సిపల్ కార్యాలయం ఎదుట టిడిపి నిరసన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలోని 30 వార్డులలో నెలకొన్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ పార్వతిపురం నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ చంద్ర ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కమిషనర్ పి.సింహాచలం కు పట్టణంలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య తాండవమాడే పరిస్థితి నెలకొందని, బురద నీరుతో పాటు కాలువలు శుభ్రం చేయక పోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయని, ప్రజలు రోగాల బారిన పడుతున్న అధికారులు పట్టించు కోకపోవడం సిగ్గు చేటన్నారు. తక్షణమే ఈ సమస్యలపై మున్సిపల్ కమిషనర్ స్పందించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు,బడే.గౌరు నాయుడు మాజీ కౌన్సిలర్ బార్నాల.సీతారాం పార్వతీపురం పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మజ్జి వెంకటేష్, కోలా. మధుసూదనరావు పట్టణ గ్రామీణ నాయకులు పాల్గొన్నారు.

పినతాడివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష -2

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని పినతాడివాడ గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకొని ఆరోగ్య సమస్యల వైద్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పేషంట్ రిజిస్ట్రేషన్ జరుగు విధానం, లాబ్ టెస్ట్, ఫార్మసీ, కంటి వైద్య శిబరాలను సందర్శించారు. ఈ శిభిరం నందు అందుచున్న వైద్యసేవలు డెంకాడ వైద్యాధికారి ఎం శివరామ కృష్ణ కుమార్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్స్ అశ్విని రెడ్డి జె సునీల్ రోగులకు వైద్య సేవలు అందించడం జరిగింది. పలు వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం 407 మందికి వైద్య సేవలు అందించారు జరిగింది.దీనితో పాటు హెచ్ బి ఈసీజీ షుగర్, బీపీ పరీక్షలు మరియు కఫం పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లవ రాజు గ్రామ సర్పంచ్ లంక లక్ష్మణరావు ఎంపీటీసీ విశానిగిరి అచ్చం నాయుడు పంచాయతీ సెక్రటరీ జగదీష్ సచివాలయ సిబ్బంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐవిఆర్ఎస్ సర్వేలో పేర్లు లేక కార్యకర్తలు ఆవేదన

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరం నియోజకవర్గంలో మంగళవారం రాష్ట్ర తెలుగు దేశం పార్టీ ఐవీఆర్ఎస్ సర్వే కాల్స్ ను సర్వే చేసింది ఈ సర్వేలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ పేరు లేకపోవడం వల్ల నియోజక వర్గంలో నాయకులు కార్యకర్తలు ఆవేదనను పార్టీ కార్యాలయంలో విలేకరుల సమా వేశంలో తెలియచేశారు ఈరోజు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు కష్ట కాలంలో అండగా నిలిచే నాయకుడు కరణం శివరామకృష్ణ అని అలాగే నియోజకవర్గంలో కరోనా సమయంలో కూడా ప్రజానీకానికి అండగా నిలిచి పార్టీ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని గజపతినగరం నియోజకవర్గంలో టిడిపి నాయకులు కార్యకర్తలు కు ధైర్యంగా నిలబడడానికి కారణం ఏకైక వ్యక్తి కరణం అని కష్టమంటే వెంటనే వచ్చే వ్యక్తి ఆయనని అన్నారు టిడిపి అధికారంలో ఉన్నప్పుడు లేనప్పుడు కూడా నాయకులను కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేశారని కొంతమంది ఇబ్బందులు భరించలేక పార్టీ మారారని కొంతమంది బాధల్ని భరిస్తూ పార్టీలోనే ఉన్నారని అలాంటి వారందరికీ అండగా నిలుస్తూ పార్టీ క్యాడర్ ని కాపాడుకుంటూ వచ్చారని టిడిపిని భుజస్కందాలపై వేసుకొని మీ అందరికీ నేను ఉన్నానంటూ ధైర్యాన్ని ఇచ్చిన ఏకైక వ్యక్తి కరణం శివరామకృష్ణ అని స్థానిక సంస్థల ఎన్నికలు సహకార బ్యాంక్ ఎన్నికలు అభ్యర్థులకు ఆర్థిక చేయూత ఇచ్చి కష్ట కాలంలో తద్వారా టిడిపిని బలోపేతం చేసిన వ్యక్తి కరణం అని అలాంటి వ్యక్తి పేరు ఈరోజు ఐవీఆర్ఎస్ కాల్స్ సర్వేలో ప్రజాదరణ పొందిన శివరామకృష్ణ ది లేకపోవడం అందరిని ఆశ్చర్యాన్ని గురిచేస్తుందని ఇప్పటికైనా పార్టీ అధిష్టానం పునరాలోచించి ఐవిఆర్ఎస్ సర్వేలో శివరామకృష్ణ పేరు రావలసిందిగా కోరుతున్నామని అదేవిధంగా టిడిపి శాసనసభ టికెట్టు ఇచ్చే విధంగా పార్టీ పెద్దలు ఆలోచన చేయవలసిందిగా కోరుతున్నామని అన్నారు ఈ సమావేశంలో పార్టీ నాయకులు లంక చిన్నమనాయుడు లంక సత్యనారాయణ శంకర్రావు కర్రీ సత్యనారాయణ మహేష్ పైల శ్రీను సన్యాసినాయుడు పైడి రాజు పిన్నింటి లక్ష్మీనాయుడు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

కౌలు రైతులకు రుణాలను మంజూరు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం: కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ మరియు జిల్లా స్థాయి సమీక్షా సమావేశం మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 వందల మంది కౌలు రైతులకు ఇంకా రుణాలు అందనట్లు గుర్తించడం జరిగిందని, వారందరికీ రుణాలు మంజూరు చేయాలని ఆయన అన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకంకింద అర్హులైన అందరినీ నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. జగనన్న ఆసరా, చేయూత వంటి పథకాల పంపిణీ కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో చేపడుతున్న సమయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అర్హులను నమోదు చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో చేపడుతున్న ప్రాధాన్యతా కార్యక్రమాలలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని, జిల్లా అభివృద్ధికి కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కాని బ్యాంకులు జిల్లాలో వ్యాపార కార్యకలాపాలు ఎందుకు చేయాలని ఆయన ప్రశ్నించారు. జిల్లా ప్రజలను ఆర్థిక కార్యకలాపాలతో (ఫైనాన్షియల్ ఇంక్లుసన్) అనుసంధానం చేయడం ఆవస్యమని బ్యాంకులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటాల్ పెన్షన్ యోజన, ముద్రా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర అంశాలలో ప్రజలను నమోదు చేయాలని ఆయన చెప్పారు. స్వనిధి క్రింద పెండింగ్ లో ఉన్న 143 దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. బ్యాంకులు బిజినెస్ కరస్పాండెంట్ (బిసి) లకు లక్ష్యాలు నిర్దేశించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జన్ ధన్ యోజన, జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటాల్ పెన్షన్ యోజన, ముద్రా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర అంశాలలో ప్రజలను నమోదుకు బిజినెస్ కరస్పాండెంట్ లకు ప్రతి పది రోజులకు లక్ష్యాలు ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జె ఎల్ ఎన్ మూర్తి మాట్లాడుతూ అశావాహ జిల్లాలో భాగంగా జన్ ధన్ యోజన, ముద్ర, జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటాల్ పెన్షన్ యోజన తదితర అంశాలపై ప్రత్యేక డ్రైవ్ పెట్టామన్నారు. ఈ సమావేశంలో ఆర్బిఐ లీడ్ జిల్లా అధికారి పి నాగ ప్రవీణ్ , నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ టి నాగార్జున, డి సి సి బి జనరల్ మేనేజర్ కె వాసు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, టి పి ఎం యు వై సత్యం నాయుడు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : మంగళవారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దఆర్టీసీ ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విజయనగరం డిపోల నుంచి సింహాచలం , ఆంధ్ర, చీపురుపల్లి- మెరకముడిదం, విజయనగరం-జామి -ఎస్. కోట మార్గాల్లో నడుపుతున్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి గిఫ్ట్ స్కీంలో ఎంపికైనవారికి అందజేశారు. జనవరి 16 నుంచి 30వ తేదీ వరకు బస్సుల్లో రూట్లలో ప్రయాణం చేసిన ప్రయాణికులు యొక్క టికెట్స్ ఆధారంగా డ్రా తీసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు బి. ఆదినారాయణ, ఎస్.టి. ఐ, పి.రామారావు, స్టేషన్ మేనేజర్ పి. సత్యనారాయణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల వివరాలను తక్షణమే ఎన్నికల పోర్టల్ లో నమోదుచేయాలి

ఈఓపిఆర్డీ వర్మ

విశాలాంధ్ర-సీతానగరం: కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు తమలాగిన్లో వున్న సచివాలయం సిబ్బంది వివరాలను ఎన్నికల పోర్టల్ లో అర్జంటుగా నమోదు చేయాలని ఈఓపిఆర్డీ కుమార్ వర్మ కార్యదర్శులను ఆదేశించారు. మంగళ వారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి ఏ సమాచారం ఎప్పుడు వచ్చిన వెంటనే స్పందించి వివరాలను పంపించాలని కోరారు.గ్రామాల్లో పోలింగు బూతుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, పూర్తి సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని కోరారు.ఇదిలా ఉండగా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను ఈగ్రామస్వరాజ్ పోర్టల్లో త్వరితగతిన నమోదుచేయాలన్నారు. ఇండ్లపన్నుల వసూళ్లను ఆన్లైన్ద్వారా సేకరించి మండలంలో నూరుశాతం పూర్తి చేయాలని కోరారు. పంచాయతీ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలు పాలిట వరం

మండల వైసీపీ నాయకులు వెంకట్రావు, వేణుగోపాలరావు

విశాలాంధ్ర-మెరకముడిదాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలు పాలిట వరం అని మండల వైసీపీ నాయకులు , తాడ్డి వేణుగోపాలరావులు అన్నారు. మంగళవారం జి మర్రివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం - 2 జరిగింది. ఈ కార్యక్రమంను కోట్ల వెంకట్రావు, వేణుగోపాలరావు లు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు కోట్ల వెంకట్రావు వేణుగోపాలరావు, మాట్లాడుతూ పేదలు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టినన్ని సంక్షేమ పథకాలు ఏ ఒక్క రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా అమలు చేయలేదన్నారు. రోగులు ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరాలు ఏర్పాటు చేస్తూ 14 రకాలు వైద్యసేవలు అందించటం జరుగుతుందన్నారు. మొదట విడతలో వేలాదిమంది రోగులుకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరాలు ద్వారా సేవలు అందించటం జరిగిందన్నారు. ప్రస్తుతం రెండవ విడతగా వైద్య శిభిరాలు ఏర్పాటుచేసి పేదలుకు వైద్య సేవలు అందించటం జరుగు తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరాలును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగనన్న ఆరోగ్య వైద్యశిభిరానికి హాజరు అయిన రోగులుకు వైద్యాధికారులు పూజా వైద్య సేవలు అందిస్తూ ఉచితంగా రోగులుకు అవసరం అయిన మందులు పంపిణీ చేశారు. ఈ వైద్యశిభిరానికి సుమారు 160 మంది వివిధ రోగాలుతో భాధపడుతున్న రోగులు హాజరు అయ్యారు. జి మర్రివలసలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరానికి ప్రజలు, రోగులు నుండి అనూహ్య స్పందన లభించింది. అనంతరం కంటి ఆపరేషన్ చేసుకున్న మంది రోగులుకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో, సిహెచ్ఓ రామారావు, సర్పంచ్ దేవా, ఎపిటిసి లు,వైద్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

42,46 డివిజన్లలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విజయనగరం పట్టణం 42వ మరియు 46వ డివిజన్ లలో దండుమారమ్మ కోవెల, కాళిఘాట్ కోలనీ, తారక రామకోలనీ, యాత వీధి, గొల్ల వీధి, అగురు వీధి, మహంతి వీధి, చాకలి వీధి మొదలగు ప్రాంతాలలో నియోజకవర్గ ఇంచార్జ్ పూసపాటి అదితి గజపతి రాజు ఇంటింటి ప్రచారం నిర్వహించి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రాన్ని కాపాడాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జ్ పూసపాటి అదితి గజపతి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని, పాదయాత్రలో హామీలు ఇచ్చి మడమ తిప్పిన జగన్ ,పెన్షన్లు పెంచుకుంటూ పోతామని చెప్పి లక్షలాది పెన్షన్లను తొలగించి వారికి అన్యాయం చేసారని, దీనికితోడు నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీలు, పెట్రోల్, గ్యాస్ చార్జీలు వంటివి విపరీతంగా పెంచడమే కాకుండా చివరకు చెత్తపై కూడా పన్ను వేసి పేదవారి నడ్డి విరిచిన ప్రభుత్వమని విమర్శించారు. అందుకే ఎల్లప్పుడూ బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండే తెలుగుదేశం పార్టీని గెలిపించి నారా చంద్రబాబు నాయుడు గారిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొట్టివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తనిఖీ

విశాలాంధ్ర-బెలగాం: గరుగుబిల్లి మండలం గొట్టివలస గ్రామంలోని జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్-2) కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు మంగళవారం తనిఖీ చేశారు. శిబిరంలో ఏర్పాటుచేసిన వివిధ కౌంటర్ల వద్ద రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. స్పెషలిస్ట్ వైద్యుల కౌంటర్ల వద్ద రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలను పరిశీలించి వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. రోగులు చెప్పే ఆరోగ్య సమస్యలను పూర్తి స్థాయిలో తెలుసుకొని తగు చికిత్స అందజేయాలని స్పష్టం చేశారు. ల్యాబ్ కౌంటర్ వద్ద రక్త పరీక్షలను వాటి నివేదికలను పరిశీలించి హెచ్చుతగ్గులున్న వారిని పర్యవేక్షణ చేయాల న్నారు. వారానికి మించి దగ్గు ఉన్న వారికి క్షయ నిర్ధారణ పరీక్షలు ఖచ్చితంగా చేయాలన్నారు. డా. వైఎస్సార్ కంటి వెలుగు తనిఖీలను పరిశీలించి కేటరాక్ట్ సర్జరీలకు గుర్తించిన వారికి సరైన నిర్దేశం చేయాలని, కళ్ళ జోళ్లు అవసరమైన వారి వివరాలు సంబంధిత వైద్య సిబ్బంది పరిశీలనలో ఉండాలన్నారు. దీర్ఘకాలిక రోగులు, వాటి ఆరోగ్య సూచనలు, లక్షణాలకు సంబందించి చిత్రాలతో కూడిన ఫ్లిప్ చార్ట్ ను అక్కడి ప్రజలకు సిహెచ్ఓ వివరించే విధానాన్ని పరిశీలించారు. ఫార్మసీ వద్ద మందులను, అత్యవసర మందులను పరిశీలించారు. మందులు వినియోగించే విధానాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియ జేయాలన్నారు. జెఎఎస్- 2 లో అందజేసిన వైద్య సేవలను ఆన్లైన్ చేయాలన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్ ను పరిశీలించి, వాటి ఆవశ్యకతను గర్భిణీలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సీ వైద్యాధికారి ఎస్. సంతోష్ కుమార్. ఈఓపిఆర్డి గోపాలరావు, సర్పంచ్ చంద్రినాయుడు, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ రత్నం, డాక్టర్ సిజ్ఞాధ, పంచాయతీ సెక్రటరీ భాస్కరరావు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది,104 దుర్గాప్రసాద్, రవి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలన సాగిస్తున్న జగన్ ను ఇంటికి సాగనంపాలి

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని

విశాలాంధ్ర-మెంటాడ : ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారం చేపట్టి రాష్ట్రాన్ని అతలాకుతలం చేసి నియంత పాలన సాగిస్తున్న జగన్ పాలనను అంతమొందించడమే లక్ష్యంగా రానున్న సార్వత్రిక ఎన్నికలలో జనసేన ముఖ్య భూమిక పోషిస్తుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మెంటాడలో జనసేన జన గర్జన సభలో ఆమె మాట్లాడారు. మెంటాడ మండలం జనసేన అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి యశస్విని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలమైందని ప్రజలకు డబ్బులు పంచడం తప్ప ఆర్థికంగా రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి పరచాలో తెలియని అజ్ఞాని జగన్మోహన్ రెడ్డి అని ఆయనతో పాటు ఆ పార్టీకి సంబంధించిన వారు కోట్లాది రూపాయలు దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని ప్రభుత్వం చేసిన తప్పులను ఎవరైనా ప్రశ్నిస్తే వారిని అరెస్టు చేయించడం ఇబ్బందులకు గురి చేయడం ఒక నియంతలాగా పాలిస్తున్నాడని జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన ప్రజలు తిప్పి కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. మండలంలో ఏదైనా సమస్య ఇబ్బందులు వచ్చినప్పుడు జనసేన మీకు అందుబాటులో ఉండడానికే ఇక్కడ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందని ప్రతి కార్యకర్త సైనికులు వలే పనిచేస్తూ అనుకున్న లక్ష్యానికి చేరటానికి కృషి చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, మెంటాడ మాజీ సర్పంచ్ రాయిపిల్లి రవిశంకర్ దేవుడు బాబు, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షులు మోహన్ రఘురాం కృష్ణంరాజు, ఆదాడమోహన్,కొల్లాభరత్ రెడ్డి రాజగోపాల్, బాబా పాల్ విజయ చౌదరి, పాండ్రంకి శ్రీనివాసరావు పలు గ్రామాల కు చెందిన జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

25, 33 డివిజన్లలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలోని 25, 33 డివిజన్లలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపడుతూ సమస్యలు లేని విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. 16 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. రోజు విడిచి రోజు నీరు పంపిణీ జరుగుతుందన్నారు. రానున్న వేసవిలో కూడా తాగునీటికి ఇబ్బందులు ఉండవని చెప్పారు. వార్డు పర్యటనలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రధాన జంక్షన్లు ఆకర్షణీయంగా తీర్చిదిద్దబడ్డాయని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అవినీతి రహితంగా అందిస్తుంటే స్థానికంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగర అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారన్నారు. మరోసారి ముఖ్య మంత్రిగా జగన్మోహన్ రెడ్డిని శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్ర స్వామిని గెలిపించినట్లయితే ప్రజలకు మరింత మేలు చేకూరుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జ్ మారం బాల బ్రహ్మారెడ్డి, కార్పొరేటర్ జీవీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కోట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్టుకై బంగారునాయుడు దరఖాస్తు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్టుకై కాంగ్రెస్ ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షుడు, మూలబొడ్డవర పంచాయతీ అంబదాసుపాలెం గ్రామానికి చెందిన గడి బంగారు నాయుడు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న అభ్యర్థుల నుండి దరఖాస్తులను తీసుకునే ప్రక్రియ మొదలుపెట్టడంతో ఆశావహులంతా పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకుని డిపాజిట్లు కట్టి తమ అదృష్టాన్ని పరీక్షించుకునే చర్యలు చేపడుతున్నారని, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరగడ రమేష్ ఆధ్వర్యంలో అధిష్టానానికి దరఖాస్తును అందజేసినట్టు గడి బంగారు నాయుడు వెల్లడించారు. స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో నిర్వహించిన పాదయాత్రలో పాల్గొని అప్పటి నుండి కాంగ్రెస్ పార్టీకి ప్రభావితులై మూలబొడ్డవర పంచాయతీలో వార్డ్ సభ్యులుగా గెలిచి ప్రజలకు అనేకసేవలను అందజేస్తూ ఆనాటి నుండి కాంగ్రెస్ నాయకుడిగానే పనిచే స్తున్నామని తెలిపారు. 2020 స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి ఎస్.కోట జెడ్పిటీసి అభ్యర్థిగా బరిలో దిగారు. యువతను ప్రోత్సహించేందుకు క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించడమే కాకుండా అగ్నిప్రమాదాల్లో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఆయన ఎస్.కోట ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బానాదిలో జగనన్న ఆరోగ్య సురక్ష సక్సెస్

402 మంది రోగులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరం సక్సెస్ గా నడిచింది. పంచాయతీలోని బానాది, ఎం సింగ వరం గ్రామాలకు చెందిన సుమారు 402 మంది రోగులు వైద్య శిభిరానికి తరలిరాగా వైద్య నిపుణులు డాక్టర్ ధరణి, డాక్టర్ పి వరలక్ష్మి, డాక్టర్ మోహన్, మత్తు వైద్యాధికారి డాక్టర్ ఈశ్వరరావు తదితరులు పాల్గొని అన్నిరకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కర్రి యశోద సారథ్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిభిరంలో హాజరైన రోగులందరికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, పంచాయతి కార్యదర్శి ప్రభుదాస్,సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని వైద్య శిభిరం విజయవంతానికి సహకరించారు.

బొద్దాంలో అక్రమ నిర్మాణం నిలిపివేత

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని బొద్దాం గ్రామంలోని అరిగి వీధిలో అక్రమ నిర్మాణంపై మండల, గ్రామ స్థాయి అధికారులు స్పందించారు. బొద్దాంలో అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు అనే శీర్షికన విశాలాంధ్రలో వార్త ప్రచురితం కాగా మంగళవారం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని నిర్మాణ పనులను నిలిపివేశారు. మండల స్థాయి అధికారులు వచ్చి పనులతో పాటు రికార్డులను పరిశీలించి సమస్య పరిష్కరించే వరకూ నిర్మాణ పనులు నిలిపి వేయాలని గ్రామ రెవెన్యూ అధికారి డీవి రమణ, పంచాయతి కార్యదర్శి అప్పల నాయుడు, మహిళా పోలీస్ కుసుమ తదితరులు చెప్పడంతో పనులు నిలిపివేశారు. అదికారులు తీసుకున్న చొరవ పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులకు డిప్యూటీ మేయర్ శ్రావణి శంకుస్థాపన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలో వివిధ ప్రాంతాలలో 41లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శంకుస్థాపన చేశారు. మంగళవారం 39, 45, 46 డివిజన్లలో రహదారులు, కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాము కృషి చేస్తున్నామన్నారు. శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్ర స్వామి ఎన్నికైన నాటినుండి ప్రతిరోజు ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు చేరువగా ఉంటున్నారన్నారు. సమస్యలను కూడా పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. దీంతో ఎన్నడూ లేనంత అభివృద్ధి ప్రస్తుతం నగరంలో జరుగుతుందన్నారు. రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనతో ప్రజలకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులు నిరంతరం చేపడుతున్నామన్నారు. ఎన్నో ఏళ్లనాటి అంబటి సత్రం కొత్తపేట రహదారికి మోక్షం కలిగిస్తూ రహదారి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. మరింత మెరుగైన పాలన అందాలంటే మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలపరిచి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు వింత ప్రభాకర్ రెడ్డి, తాళ్లపూడి సంతోషి కుమారి,బొద్దూరు గోవిందమ్మ,, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

9న జాబ్‌మేళా

విశాలాంధ్ర-విజయనగరం : వివిధ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 9న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. అల్ట్రాటెక్ సిమ్మెంట్, పేటిం స్మార్ట్ సర్వీసెస్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. అల్ట్రాటెక్ కంపెనీలో టెక్నికల్, అప్లికేషన్ ఇంజనీర్స్-06, పేటిం కంపెనీలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్-100 ఉద్యోగాల భర్తీ జరుగు తుందని తెలిపారు. పురుష అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌సిఎస్.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్స్ లాగిన్‌లో నమోదు చేసుకొని, ఈనెల 9న ఉదయం 10 గంటలకు విజయనగరం బిసి కాలనీ సమీపంలోని ప్రభుత్వ ఐటిఐలో జరిగే ఇంటర్వ్యూకి, సంబంధిత సర్టిఫికేట్ కాపీలతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం 8919378915 నంబరుకు సంప్రదించాలని అరుణ సూచించారు.

తేనెటీగల పట్టుతో పొంచివున్న ప్రమాదం

స్కూలు ఆవరణలో ఉండటంతో భయాందోళన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో లోచర్ల గ్రామంలో హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో చెట్టుకు పెద్ద తీనేటీగల పట్టు ఉండడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది, ఈ హైస్కూల్ లో 90 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు హ్యాండ్ వాష్ చేసుకునే కొళాయిల దగ్గర ఉండడం తో దాని పక్కనుంచి విద్యార్థులు తిరుగుతున్నారు. ఎవరో ఒకరు విద్యార్థి ఆకతాయిగా రాయితో కొట్టినట్లు అయితే, తీనేటీగలు కదలి విద్యార్థులను కుట్టే ప్రమాదం ఉందని ఇక్కడ ఉన్న విద్యార్థులు తెలుసుకోక ఆ తీనేటీగా పట్టు చుట్టే తిరుగుతున్నారు. ఈ విష్యం హై స్కూల్ ప్రధానోపాధ్యారాలు కు విలేకర్ పట్టు విష్యం తన దృష్టిలో పెట్టగా చూసుకోలేదండి, తక్షణమే తొలిగిస్తామని ప్రధానోపాధ్యారాలు విలేకర్ తో తెలిపారు.

జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంపై

ఆశాలకు అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : ఆశా డే సందర్భంగా జిల్లా హాస్పిటల్ ప్రాంగణం లో గల పిపి యూనిట్ లో ఆశా డే కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ ఎం. నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 9వ తేదీన జరగనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంపై ఆశాలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఈ-ఆశ యాప్ పైన గర్భిణీల రక్తహీనతపై, ఫ్యామిలీ డాక్టర్ విధానంపై ఇతర ఆరోగ్య సమస్యలపై వారికి అవగాహన కల్పించారు. బాలింతలకు, గర్భిణులకు ప్రసవ సమయం దగ్గర పడుతున్న గర్భిణీల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతీ నెలా 9వ తేదీన జరిగే పిఎమ్ఎస్ఎమ్ఎ కార్యక్రమానికి గర్భిణీలు హాజరయ్యేటట్లు చూడాలన్నారు. కాన్పు సమయం దగ్గరగా ఉన్న వారిని, అరుదుగా ఉన్న బ్లడ్ గ్రూప్ తో ఉన్నవారిని గుర్తించాలన్నారు. సాధారణ ప్రసవాలు అన్నీ పిహెచ్సి లో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. హెచ్ఐవి, సిఫిలిస్, టిబి, షుగరు నిర్ధారణ పరీక్షలు ఖచ్చితంగా జరపాలన్నారు. గర్భస్థ పిండం ఎదుగుదల తీరు, లోపాలను గుర్తించేందుకు జరిపే టిఫ్ఫా స్కానింగ్ ఇప్పుడు ఆరోగ్యశ్రీ అనుబంధ ఆసుపత్రిలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదని అన్నారు. హై రిస్క్ గర్భిణీలను, రక్త హీనత గర్భిణీలను ఎనీమియా బారిన పడకుండా చూడాలన్నారు. ఆసుపత్రికి చేర్చేందుకు తల్లి-బిడ్డ ఎక్స్ప్రెస్ వాహనం అందుబాటులో ఉందని, అదేవిధంగా పిఎంఎంవివై, జెఎస్వై, ఆరోగ్య ఆసరా మొదలగు సంక్షేమ పథకాలు ఉన్నాయని, గర్భిణీల ఆరోగ్య శ్రేయస్సుకై ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ఆరోగ్య సేవలు పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పిపి యూనిట్ వైద్యులు డా. మన్మో, డా. లావణ్య, హెల్త్ సూపర్ వైజర్లు జయగౌడ్, పి. పుష్ప, ఇందిర, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం

విజయనగరం నియోజకవర్గ ఇన్చార్జ్ అదితి విజయలక్ష్మి గజపతిరాజు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : పట్టణంలోని 40 డివిజన్ బొగ్గులు దెబ్బ ఎస్సీ కాలనీలో నివాసముంటున్న నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటామని విజయనగరం నియోజకవర్గ అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు మంగళవారం 41 డివిజన్ బొగ్గులు దెబ్బ ఎస్సీ కాలనీలో నివాసముంటున్న 18 కుటుంబాల ఇళ్లను మున్సిపల్ యంత్రాంగం తొలగించడం అన్యాయం అన్నారు. కొంతమంది వైకాపా పార్టీకి చెందిన వారి ప్రోత్సలంతో ఈ తొలగింపులు జరుగుతున్నాయన్నారు. 18 కుటుంబాలు వారు కోర్టును ఆశ్రయించగా కోర్టు వారి వాదనను విని వాయిదా 7.2.24 కి వాయిదా వేసినప్పటికీ. మున్సిపల్ యంత్రాంగం ముందు గుండా తొలగింపులు చేయటం దారుణం అన్నారు. కోర్టు అనుమతులు వచ్చిన తర్వాతే తొలగింపులు జరపాలని సిబ్బందిని అడిగినప్పటికీ చట్టాలను గౌరవించకుండా తొలగింపులు చేశారన్నారు. న్యాయస్థానం నుండి తీర్పు వెలువడినంతవరకు తొలగింపు ఆపాలని చెప్పినప్పటికీ పూర్తిస్థాయిలో ధ్వంసం చేశారని తెలిపారు. ఈ చర్యను ఖండిస్తున్నామన్నారు.

గజపతినగరం కాంగ్రెస్ టిక్కెట్‌కై ధరఖాస్తు చేశా..

ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు సుంకరి గణేష్

విశాలాంధ్ర-జామి: రానున్న ఎన్నికలలో గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ కోసం అధిష్టానంకు ధరఖాస్తు చేశానని ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు సుంకరిగణేష్ తెలిపారు. ఈమేరకు ఇప్పటికే రాష్ట్ర నేతలను కలవడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటికే అనేక విద్యార్థి, యువజన ఉద్యమాలలో కీలకపాత్ర పోషించానన్నారు. తనపట్ల పార్టీ అధిష్టానం సానుకూలంగా వ్యవహరిస్తోందని, స్థానికంగా తనకున్న మద్దతును అధిష్టానం దృష్టికి తసుకువెళ్లానన్నారు. ఎన్ఎస్‌యూఐ కోటాలో తనకు టిక్కెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేసారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించిన

ఎంఈఓ భాస్కరరావు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వావిలపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి పి. బాల భాస్కరరావు మంగళవారం సందర్శించారు. అనంతరం ఆయన లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం ను పరిశీలించారు. అదేవిధంగా మండలంలో చామలాదేవి గ్రామంలో గల ఎంపియుపి పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం ఆయన పాఠశాల పరిసరాలను, పాఠశాల రికార్డ్స్ ను, మధ్యాహ్న భోజన పథక అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

శివైక్యం పొందిన సింహాద్రప్పన్న ఎద్దుకు అంత్యక్రియలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మండలంలోని మామిడిపల్లిలో శివైక్యం పొందిన సింహాద్రప్పన్న ఎద్దుకు శృంగవరపుకోటకు చెందిన దాసరి కులస్తులు సంప్ర దాయరీతిలో అంత్యక్రి యలను మంగళవారం నిర్వహించారు. వీరు సింహాచలం సింహాద్రప్పన్నకు ప్రతిరూపంగా కొలిచే ఎద్దు మామిడిపల్లిలో మృత్యువాత పడింది. ఈ విషయం గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న శృంగవరపుకోట దాసరి కులస్థులు మామిడిపల్లి గ్రామానికి చేరుకుని మేళాతాళాలు వాయిస్తు.. దానికి నూనె దీపం అర్పిస్తూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేశారు. గ్రామ సమీపంలోనే ఎద్దును ఖననంచేశారు. ఈ దృశ్యాలను చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చి ఎద్దు అంత్యక్రియాల్లో పాల్గొనడం విశేషం.

ఉపాధి హామీ పథకం ఫిల్టర్ ఛానల్ పనులు పరిశీలన

విశాలాంధ్ర-గజపతినగరం : మండలంలోని డోల పాలెం గ్రామంలో మంగళ వారం ఉపాధి హామీ పథకం ఫిల్టర్ ఛానల్ పనులకు ఆ పథకం ఏపీవో సిహెచ్ రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం పొందాలని అన్నారు వేతన దారుల మస్టర్లను తనిఖీ చేశారు.

మార్కొండపుట్టిలో జిసిసి ఎండి పరిశీలన

విశాలాంధ్ర-మక్కువ: మండలంలో వందన్ వికాస్ కేంద్రాలను జిసిసి ఎండి వైస్ చాన్సలర్ సురేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. మార్కండపుట్టి గ్రామంలో నటరాజ్ పసుపు ప్రాసెసింగ్ యూనిట్ ను ఆయన సందర్శించారు. ఆయన గిరిజనుల నుండి పసుపు ఏ విధంగా సేకరిస్తున్నారు గిరిజనులు పండించే గిరిజన ఉత్పత్తులను సేకరించి ప్రాసెసింగ్ చేసి గిరిజన కార్పొరేషన్ ద్వారా ఐకెపి సంయుక్తంగా సేకరించి గిరిజన ఆర్థిక అభివృద్ధి చేసే విధంగా ముందుకు నడపాలని సూచించారు. గిరిజన కార్పొరేషన్ నుండి ఏ విధమైన సహకారం కావాలన్నా వందన వికాస్ కేంద్రాల బలోపేతానికి జిసిసి ని వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిసిసి మేనేజర్ మహేంద్ర కుమార్ మార్కెటింగ్ మేనేజర్ వి రమణ మూర్తి, ప్రవీణ్ కుమార్ ఏపీఎం సన్నీ బాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను డిఎంఓ

డా. టి. జగన్ మోహనరావు సందర్శన

విశాలాంధ్ర-బెలగాం/ బలిజిపేట : బలిజిపేట మండలం గలావిల్లి, బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు మంగళవారం సందర్శించారు. ల్యాబ్ పరీక్షల రికార్డులు తనిఖీ చేసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నివేదికల వివరాలు పరిశీలించారు. మైక్రోస్కోప్, ల్యాబ్ పరికరాల పనితీరును గమనించారు. పిహెచ్సిలో మందులు, వ్యాక్సిన్ నిల్వలు వాటి నిర్వహణ రికార్డులు తనిఖీ చేశారు. ప్రసూతి గదిలో డెలివరీ కొరకు అవసరమైన సదుపాయాలు ఏ మేరకు నిర్వహిస్తున్నారో పరిశీలించి, పిహెచ్సిలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పిహెచ్సిల్లో నిర్వహించిన ఆశాడే సమావేశంలో డాక్టర్ జగన్మోహనరావు పాల్గొని పలు ఆరోగ్య కార్యక్రమాల సమీక్ష చేశారు. ఈనెల 9న నిర్వహించనున్న డీ వార్మింగ్ డే కార్యక్రమం కార్యచరణ సిద్ధం చేయాలన్నారు. సం. నుండి 19 సం. వయస్సు వరకు పిల్లలందరికీ నిర్దేశించిన మార్గదర్శకాలు పాటిస్తూ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వేలు నిర్వహిస్తూ జ్వర లక్షణాలు,ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తిస్తే వెంటనే ప్రాథమిక చికిత్స అందజేసి, మలేరియా,డెంగ్యూ మొదలగు జ్వరం నిర్ధారణ అయితే వెంటనే సమాచారాన్ని డిఎంఓ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్ త్వరగా జరగాలని, హైరిస్క్ గర్భిణీల ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేయాలని సూచించారు. పిల్లలకు శత శాతం లక్ష్యంగా సకాలంలో టీకాలు వేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ సూర్యనారాయణ, వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కిరణ్మయి, సూపర్ వైజర్స్ కె. కర్ణ, వెంకటరమణ, చింతల్లి, చంద్రావతి, నాని, ఎఎన్ఎంలు, సిహెచ్ఓలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లోపు ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఎన్నికలలో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే జోగారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అమర్ భవన్‌లో జిల్లా శాఖ కార్యవర్గ సమావేశాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కే జోగారావు మాట్లాడుతూ జీవో నెంబర్ 117 తక్షణమే రద్దు చేయాలని,జిపిఎఫ్ ,ఏపీ జి ఎల్ ఐ సి, మెడికల్ లీవ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. అప్రెంటిస్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టే ఆలోచన విరమించు కోవాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ పునరుద్దరించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతలపై ఉన్న అక్రమ కేసులను కొట్టివేయాలన్నారు. ఉపాధ్యాయులకు భారంగా ఉన్న అనవసర యాప్ లను రద్దు చేయాలన్నారు. 77వ వార్షిక జిల్లా కౌన్సిల్ సమావేశం నూతన కార్యవర్గ ఎన్నిక ఈనెల 11న అమర్ భవన్లో జరుగునని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి శ్యామ్, రాష్ట్ర కౌన్సిలర్ వి గోవిందరావు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సిహెచ్ సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి ఈశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతే ధ్యేయంగా ప్రజారోగ్య సిబ్బంది

మరింతగా కృషి చేయాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగర పరిశు భ్రతే ధ్యేయంగా ప్రజారోగ్య సిబ్బంది మరింతగా కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు ఆదేశించారు. విచ్చలవిడిగా చెత్తాచెదారాలు ఎక్కడబడితే అక్కడ వేయకుండా, కాలువల్లో చెత్తల పేరుకుపోకుండా ప్రజలలో మరింత అవగాహన తీసుకురావాలని సూచించారు. మంగళవారం ఉదయం వాహనాల డిపోను ఆయన సందర్శించారు. వాహనాలన్నీ సకాలంలో సిద్ధంగా ఉంచుతున్నారా లేదా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల సమయం కల్లా సంబంధిత డివిజన్లలో వాహనాలు తరలించాలని ఆదేశించారు. అలాగే వాహనాలు మరమ్మత్తు విషయమై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పుష్ కార్టులు, డంపర్ బిన్లు మరమ్మతులకు గురైతే వాటి వివరాలు పూర్తిస్థాయిలో అందివ్వాలని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలలో సంపూర్ణ పారిశుధ్యం పట్ల మరింత అవగాహన పెంచాలన్నారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ప్రజారోగ్యం అత్యంత ముఖ్యమైన విషయాన్ని గుర్తించాలన్నారు. ఇందుకోసం పూర్తి బాధ్యత ప్రజారోగ్య విభాగం పై ఉందన్నారు. రహదారులపై, జనావాసాల ప్రాంతాలలో చెత్తాచెదారాలు పేరుకుపోకుండా అనునిత్యం శ్రద్ధ వహించాలన్నారు. వీధులలో పరిశుభ్ర వాతావరణం నెలకొనే విధంగా చూడాల్సిన బాధ్యత ఆయా శానిటరీ కార్యదర్శులదేనని అన్నారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య విషయమై ప్రత్యేక శ్రద్ధతో మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న ఉద్దేశంతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కంటి అద్దాల పంపిణీ

విశాలాంధ్ర-జామి :జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలు ఉన్నట్లుగా,గతంలో గుర్తించిన 18 మందికి కంటిఅద్దాలను పంపిణీ చేయడం జరిగింది. విజినిగిరి గ్రామ సచివాలయంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ ఆరోగ్యశిబిరములో వైద్య నిపుణులు డా.సామ్రాజ్యలక్ష్మి,డా.ఎ.వి.ఎస్.ఉషారాణి,డా.ఎస్.ఎ.చారి పాల్గొని 224 మంది రోగులకు తనిఖీలను నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ సర్పంచ్ కె.సూర్యారావు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్ ప్రేమ కుమార్, గ్రామసచివాలయం కార్యదర్శి కె.సుజాత,సి.హెచ్. ఓ.ఫ్లోరెన్స్,ఎ.ఎన్.ఎమ్.లు, ఎమ్.ఎల్.హెచ్.పి.లు, ఆరోగ్య సహాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కాంగ్రెస్ అభ్యర్థిగా సానమునేటి

శ్రీనివాసరావు దరఖాస్తు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల వేడి ఉపందుకుంది విజయనగరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నగరాల సంఘం జిల్లా అధ్యక్షుడు, విజయనగరం బిసి సంఘ ఉపాధ్యక్షులు సానమునేటి శ్రీనివాసరావు ధరకాస్తు చేసుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కి సేవలు అందిస్తున్న ఆయన వచ్చే ఎన్నికల్లో విజయనగరం కాంగ్రెస్ అభ్యర్థిగా తనను కూడా గుర్తించాలని డిసిసి అధ్యక్షుడు రమేష్ కుమార్ తో విజయవాడ పిసిసి కార్యాలయంలో ధరకాస్తు చేసుకున్నారు. శ్రీనివాసరావు కి జిల్లాలో బిసి నాయకునిగా మంచి పేరు ఉంది. అంతే కాకుండా ప్రధాన రాజకీయ పార్టీలు విజయనగరం అభ్యర్థిగా ఓ.సి లకు సీట్లు కేటాయిస్తూ ఉండటం కాంగ్రెస్ పార్టీ బిసి కి సీటు ఇస్తే మంచి ఫలితం ఉండిందని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి గా సుంకరి సతీష్ దరఖాస్తు

విశాలాంధ్ర-విజయనగరం : విజయనగరం నియోజక వర్గ అభ్యర్థి గా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ సుంకరి సతీష్ విజయవాడలో ని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు అందజేసారు. సతీష్ ప్రస్తుతం విజయనగరం పట్టణ కాంగ్రెస్ అధ్రక్షునిగా వ్యవహరిస్తున్నారు.

అభ్యుదయ విద్యాసంస్థలు, ఫౌండేషన్ ఆధ్వర్యంలో

నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో మంగళ వారం ఉదయం 10గం నుండి మధ్యాహ్నం 2గం వరకు గౌడవీధిలో హైస్కూల్ క్యాంపస్ లో అభ్యుదయ ఫౌండేషన్ మరియు అభ్యుదయ విద్యాసంస్థల కరెస్పాండెంట్ మర్రపు కూర్మ నాయుడు (నాని) ప్రపంచ మానవ హక్కుల కౌన్సిల్ సౌత్ ఇండియా మహిళా అధ్యక్షులు డాక్టర్ చింతా శారద లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిభిరం కి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో సాగర్ దుర్గ, సింహాద్రి, హెచ్ సి జి హాస్పిటల్స్ నుండి వచ్చిన జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, ఈ ఎన్ టి మరియు క్యాన్సర్ కి సంబంధించిన వైద్యులు 215 మంది రోగులను పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన ముందులను ఉచితంగా పంపిణీ చేశారు. అవసరమనుకున్న 21 మందికి ఆపరేషన్ కోసం హాస్పిటల్ కి రిఫర్ చేసినట్లు అభ్యుదయ విద్యాసంస్థల కరెస్పాండెంట్ మర్రపు కూర్మనాయుడు(నాని) ప్రపంచ మానవ హక్కుల కౌన్సిల్ సౌత్ ఇండియా మహిళా అధ్యక్షురాలు, అభ్యుదయ ప్రిన్సిపాల్ , అభ్యుదయ ఫౌండేషన్ ఫౌండర్ అధ్యక్షులు డాక్టర్ చింత శారద లు మాట్లాడుతూ అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాజసేవలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వంతెనను ఢీకొన్న వ్యాన్

విశాలాంధ్ర-కురుపాం: మండలం గుమ్మ గదబవలస సమీపంలో గల వంతెన వద్ద పెద్ద ప్రమాదం తప్పింది. పార్వతీపురం నుండి గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కళాశాల కు పరీక్ష పేపర్లు తీసుకువెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి వంతెన ను ఢీకొట్టింది. దాంతో రాకపోకల కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొంచెం ముందుకు వెళ్తే వ్యాన్ వంతెన లో బోల్తా కొట్టేదని, ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వంతెనకు రక్షణ గోడలు లేక చాలా ప్రమాదాలు సంభవించాయని వాహనదారులు వాపోతున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత : డీఎస్పీ

విశాలాంధ్ర-వంగర : మాజంలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, శాంతిభద్రతలు క్షీణించకుండా పోలీసు శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా పనిచేస్తుందని డీ ఎస్ పీ ఏ.శ్రీనివాస చక్రవర్తి అన్నారు. మంగళవారం వంగర పోలీస్ స్టేషన్‌ను సీ ఐ శ్రీనివాసరావు తో ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. అంతే కాకుండా ఆయనమాట్లాడుతూ శాంతి భద్రతలు మన బాధ్యత అని పోలీస్ శాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.శాంతియుతవాతావరణంలో అభివృద్ధి సాధ్యమని అన్నారు. నేరాలు, ఘోరాలు జరగకుండా అదుపు చేసేందుకు పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తుచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయనఅన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించడానికి చర్యలు చేపడుతూ పోలీస్ సిబ్బందిని సంసిద్ధులను చేస్తున్నట్లువెల్లడించారు.రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో ఎన్నికలు జరిగిన సమయంలో ఏ ఏ గ్రామా ల్లో అప్పటి పరిస్థితులు, సమస్యా త్మక గ్రామాలకు దారి తీసిన వివరాలు,అలాంటి వాటికి కారకులైన వ్యక్తులు,నాటి పాతో కసులు తదితర వివరాలను సేకరించి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.రానున్న ఎన్నికలకు కేంద్ర మిలటరీ బలగాలతో ఎన్నికలు జరిగే టట్లు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ మండలం నకు సంబంధించిన వీవీ అర్ పేట, శివ్వాం, లక్ష్మింపేట, కొట్టిశ, శ్రీహరిపురం అర్అండ్ అర్ కాలనీ, ఇప్పటికి గుర్తించినట్లు చెప్పారు.అప్పటి పరిస్థితుల ను బట్టి అవసరమైతేమరికొన్ని గ్రామాలను చేర్పు చేస్తామని డీ ఎస్ పీ శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. ముందుగా డిఎస్పీ శ్రీనివాస చక్రవర్తి,రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావులు వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించి లేబ్ ను పరిశీలించారు.ఇక్కడ గతంలో ఫోక్స్ కేసు నమోదైనట్లు తెలిసింది.దీని పూర్తి స్థాయి దర్యాప్తు కోసం మరికొన్ని రోజుల్లో వీరు ఈ హై స్కూలుకురానున్నట్టు సమాచారం

ఓపిఎస్ సాధన అన్ని పార్టీల అజెండా కావాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు

విశాలాంధ్ర-జామి: రానున్న ఎన్నికల్లో పాత పెన్షన్ విధాన సాధన అన్ని పార్టీల రాజకీయ ఎజెండా కావాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎవిఆర్‌కె.ఈశ్వరరావు తెలిపారు.జామి ఎంఆర్‌సి వద్ద మంగళవారం సాయంత్రం పాత పెన్షన్ విధానం రాజకీయ అజెండా కావాలని ఆకాంక్షిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. వారం రోజులలో సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించి ఎటువంటి ఉపయోగం లేని జిపిఎస్ విధానం తీసుకొచ్చారన్నారు.రానున్న ఎన్నికల్లో ఓపిఎస్‌సాధన ఎజెండా చెయ్యాలని అన్ని రాజకీయ పక్షాలను మండల జిల్లా రాష్ట్ర స్థాయిలో కలుస్తామని చెప్పారు.ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలు అన్నిటినీ సంఘటిత పరిచి ఓపిఎస్ సాధన లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తామని,అలాగే ప్రభుత్వ పాఠశాల విద్యను బలహీన పరిచే జీఓ నెంబర్ 117 ను రద్దు చేయాలని,ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాల లో విలీనాన్ని రద్దు చేయాలని విలీనాన్ని రద్దు చేయకపోతే నాడునేడుకు వేల కోట్లు ఖర్చు చేసి పాఠశాలలను సుందరంగా తయారు చేసిన విద్యార్థులు లేక ఉపయోగం లేకుండా పోతుందని, జీవో 117 రద్దు చేయకపోతే రానున్న కాలంలో గ్రామాల్లో పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని తెలియచేసారు అలాగే విద్యార్థులకు మీడియం ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ లో యుటిఎఫ్ ఈశ్వరరావు,జిల్లా కార్యదర్శి జి. రాజారావు, మండల అధ్యక్షులు వి. వాసుదేవరావు, ,ట్రెజరర్ శ్రీధర్,జిల్లా కార్యవర్గ సభ్యులు దేముడుబాబు, మహిళా సభ్యులు అదివమ్మ,మాధవీలత ఇతర మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఓపిఎస్ అమలు చేసే పార్టీకే మా ఓటు అని నాయకులు పిలుపిచ్చారు.

మక్కువ లో గుమ్మడి సంధ్యారాణి ఆధ్వర్యంలో

జయహో బిసి కార్యక్రమం

విశాలాంధ్ర-మక్కువ: మండలంలో జయహెూ బీసీ కార్యక్రమంలో గుమ్మడిసంధ్యారాణి ఈ విధంగా.నాలుగున్నరెళ్ళ వైసీపీ అరాచక పాలనకు సృష్టి పలకాలి. సైకో పాలన నుండి రాష్ట్రాన్ని కాపాడేందుకు అందరూ కలిసి ముందుకు రావాలని అవినీతి అరాచక పాలనను తరిమి కొట్టడం మనందరి బాధ్యత అని ఈ వైసీపీ ప్రభుత్వం లో బీసీ ఎస్సీ ఎస్టీ వెనుక బడిన ప్రజలు దగాపడ్డారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పింది. రాష్ట్రం ఆర్థికంగా వెనకబడింది - వచ్చేది టీడీపీ ప్రభుత్వం అని టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే.తల్లికి వందనం" పేరుతో మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 15,000/ మహాశక్తి పథకం కింద 18ఏళ్ల పై బడిన మహిళలకు "ఆడబిడ్డ నిధి" కింద నెలకు 1500/- రూపాయలు చొప్పున ఏడాదికి 18000/- రూపాయలు. దీపం పథకం" కింద ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం.యువగళం పథకం" కింద డిగ్రీ చదువుకొన్న నిరుద్యోగ యువతకు నెలకు 3000/- చొప్పున ఉద్యోగం వచ్చేవరకు అన్నదాత పథకం" కింద రైతన్నలకు యేదాదికి 20,000/- రూపాయలుఇంటింటికీ మంచి నీరు పథకం" కింద ప్రతీ ఇంటికి రక్షిత త్రాగునీటి కుళాయి కనెక్షన్.పూర్ టూ రిచ్ పథకం" కింద పేదల ఆదాయం ఐదేళ్ల లో రెట్టింపు చేసి సంపన్నులు చేయడం. బీసీ రక్షణ చట్టం పథకం" కింద వైసీపీ ప్రభుత్వం లో బీసీల పై దాడులు పెరిగాయి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలో బీసీ రక్షణ చట్టం తెచ్చి అండగా నిలవడం. గ్రామాలు దేశానికి పట్టు కొమ్మ అని గాంధీజీ చెప్పారు వాటిని బలోపేతం చేయడానికి తెలుగు దేశం పార్టీ మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ ను తెచ్చింది అని వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యం చేశారు అని రాష్ట్రం లో సర్పంచులు ఆత్మ హత్య చేసుకునే పరిస్థితి వచ్చింది అని ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టించి స్వాహా చేసిన ఘనుడు ఈ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అని అన్నారు.టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం. గ్రామాలను అభివృద్ధి చేస్తాం అని అన్నారు మక్కువ మండలంలో జయహెూ బీసీ కార్యక్రమం 21 పంచాయతీమండల నాయకులు హాజరయ్యారు టిడిపి గెలుపు కోసం నాయకులు కార్యకర్తలు అందరూ సహకరించాలి చంద్రబాబు గెలిచిన వెంటనే గెలుపు బాబుతోనే సాధ్యమని అన్నారు బాబు వచ్చిన వెంటనే మహిళలకు మూడు సిలిండర్లు బస్సు టికెట్ ఫ్రీ ప్రతి నిరుపేదలకు సంవత్సరంలో ఉద్యోగాలు కార్యకర్తల నాయకులందరూ ప్రతి గ్రామాలలో ప్రజల్లో మమేకమై చంద్రబాబు పరిపాలన గురించి చంద్రబాబు అభివృద్ధి గురించి అందరికీ తెలియపరచాలి మండలంలో టిడిపిలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని కలుపుకు పోతామని టిడిపి గెలిపి లక్ష్యమని 2024లో చంద్రబాబు నాయుడు సీఎంగా చేయాలని గెలిపించాలని అందరూ ఆశీర్వ దించాలని కోరారు కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు పార్టీ సీనియర్ నాయకులు ప్రసాద్ నాయుడు సాలూరు పట్టణ అధ్యక్షులు తిరుపతిరావు అధ్యక్షులు చలుమూరి వెంకటరావు సాలూరు మండల అధ్యక్షులు ఆముదాల పరమేశ్వర రావు ముఖి సూర్యనారాయణ చింతల తవిటి నాయుడు జి భూషణరావు రౌతు రామారావు డాక్టర్ద మల్లేశ్వరరావు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలు రాస్తోన్న అభ్యర్థులకై ధీరా ఫౌండేషన్

11న ఉత్తరాంధ్రలో పలుచోట్ల మాక్ ఎగ్జామ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్షలు రాస్తోన్న అభ్యర్థుల సౌలభ్యం కోసం ధీరా ఫౌండేషన్ ఈనెల 11న ఉత్తరాంధ్రలో పలుచోట్ల మాక్ ఎగ్జామ్ నిర్వహించబోతున్నట్టు సంస్థ ఫౌండర్ డాక్టర్ బొత్స సందీప్ చెప్పారు. ఈ పరీక్షకు హాజరు కాబోయే అభ్యర్థులు dheerafoundatn.com అనే వెబ్సైటు లింక్ ను ఓపెన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చాన్నారు. 9 వ తేదీ వరకూ ఈ లింక్ లో రిజిస్ట్రీ అయిన వారికి ఎగ్జామినేషన్ సెంటర్ వివరాలను ఎస్ ఎం ఎస్, వాట్సాప్ సందేశాల ద్వారా తెలియ జేయడం జరుగుతుందని చెప్పారు. ఉత్త రాంధ్ర లోని అన్ని ముఖ్య పట్టణాలలో ఏ పీ పీ ఎస్ సీ మాక్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తామన్నారు. పలు కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధమవుతున్న వారి కోసం తమ ఫౌండేషన్ స్టడీ మెటీరియల్ ను గత ఏడాదిగా ఉచితం గా పంపిణీ చేస్తుందన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకు స్టడీ మెటీరియల్ ను ఉచితంగా సరఫరా చేయడం జరిగిందన్నారు. మారు మూల ప్రాంతాలకు చెందిన అభ్యర్థులకు గ్రూప్ 2 పరీక్ష మోడల్ ను తెలియజేయాలనే ఈ టెస్ట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐతే పలువురు అభ్యర్థులు మాక్ టెస్ట్ నిర్వహించాల్సిందిగా ఫౌండేషన్ ను కోరారన్నారు. ధీరా ఫౌండేషన్ గత ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల ఎగ్జామినేషన్ పేపర్లను, మారిన సిలబస్ ను దృష్టిలో పెట్టుకుని మాక్ టెస్టు పేపర్లను రూపొందించిందని డాక్టర్ సందీప్ చెప్పారు. అలాగే మాక్ పరీక్షకు హాజరు అయ్యే వారికి ఆన్లైన్ మెటీరియల్ ను ఉచితంగా అందిస్తామని తెలియజేశారు. ధీరా ఫౌండేషన్ ఇందుకోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు సబ్స్క్రయిబ్ అయ్యేందుకు ఎటువంటి మొత్తం చెల్లించనక్కరలేదని అన్నారు. ధీరా ఫౌండేషన్ సంస్థాపన ఆశయాల్లో విద్యా ఉపాధి కల్పన కు చేదోడుగా నిలవడం ముఖ్య మైన అంశమన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అభ్యర్థులు మాక్ టెస్టును ఉపయోగించు కోవలసిందిగా డాక్టర్ సందీప్ సూచించారు.

స్టాపర్స్‌ను ఢీకొని యువకుడికి గాయాలు

విశాలాంధ్ర-కురుపాం : స్పీడ్ బ్రేకర్ వద్దనున్న (స్టాపర్)ను బైక్‌తో బలంగా ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రానికి సమీపంలో గల మూలిగూడ జంక్షన్ వద్ద సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గుమ్మిడిగూడ పంచాయతీ దండుసుర గ్రామానికి చెందిన కొండగొర్రి సూర్యనారాయణ అనే వ్యక్తి కురుపాం వెళ్తుండగా మూలిగూడ జంక్షన్ వద్ద పోలీసు ఏర్పాటు చేసిన స్టాపర్స్ ఢీకొని తీవ్ర గాయాలు అవడంతో వెంటనే 108 కి సమాచారం ఇచ్చి 108 వాహనం ద్వారా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రమైన తరలించామని అక్కడ వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజకీయ పార్టీ నాయకులతో

సమావేశం

విశాలాంధ్ర- గజపతి నగరం : గజపతి నగరం తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసిల్దార్ రమేష్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో పరమేశ్వరి గాంధీ ఏఈఆర్వోలు నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ చిన్న పిల్లలతో ర్యాలీలు స్లొగన్స్ జెండాలు మిక్సీలు పెట్టకూడదని మొదలగు సూచనలు తెలియజేశారు ఈ సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మీ నాయుడు వైసిపి నాయకులు శీర రమణ సిపిఎం జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.